సాక్షి
బాపట్ల
గురువారం । 4 । మే । 2023



1,17,725 బస్తాల మిర్చి విక్రయం


కొరిటెపాడు(గుంటూరు): యార్డుకు బుధవారం 1,12,240 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,17,725 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000 , గరిష్ట ధర రూ.4,200 , మోడల్ ధర రూ.3,200 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సం భవించలేదు.

న్యూస్‌రీల్

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి



వినుకొండ(నూజెండ్ల): కుక్కల దాడిలో చుక్కల దుప్పి గాయపడి మృతి చెందింది. ఈ ఘటన పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు చోటు చేసుకుంది. ఫారెస్ట్ రేంజ్ అధికారి హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి కనిపించింది. వారు తమకు సమాచారం అందజేయడంతో సంఘటన స్థలానికి వెళ్లి దుప్పిని అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చే క్రమంలో దుప్పి చనిపోవడం జరిగిందని, పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ పశువైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు. అరణ్యం నుంచి తప్పిపోయిన వన్యప్రాణులు పట్టణ ప్రాంతాలు, జనావాసాల్లోకి వస్తున్నాయని, ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ప్రజలు అధికారులకు తెలియజేయాలని కోరారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు ఒక్కరోజు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు బుధవారం ముగిసిన గడువును గురువారం సాయంత్రం వరకు పొడిగించినట్లు ఆర్ఐఓ జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల నుంచి మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజులను గురువారం సాయంత్రం లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

హెరిటేజ్ మ్యూజియంలో శిల్పాల పరిశీలన



అమరావతి: ప్రపంచ స్థాయి సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనకు ఎంపికైన అమరావతి బౌద్ధ స్థూపాలను అధికారుల బృందం బుధవారం సందర్శించింది. బృందంలో భారత పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ జీనా గోపినాథ్, సూర్యప్రకాష్, రాష్ట్ర ఆర్కియాలజీ శాఖ డెప్యూటీ డైరెక్టర్లు సురేష్, రామసుబ్బారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ స్వామినాయక్ ఉన్నారు. భారత పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ జీనా గోపినాథ్ మాట్లాడుతూ అమెరికాలోని న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియంలో నిర్వహించే ట్రీ సెర్పెంట్ ది ఎవల్యూషన్ ఎర్లీ బుద్దిస్ట్ ఆర్ట్ ఇన్ ఇండియా కార్యక్రమంలో ఈ స్థూపాలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. శిల్పాలను తరలించే బాధ్యత ప్రభుత్వం ఒక సంస్థకు అప్పగించిందన్నారు. వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

నరసరావుపేట ఈస్ట్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం పేదలకు కేటాయించిన 25శాతం సీట్లు భర్తీ చేసేందుకు రెండవ విడత అవకాశం కల్పిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ బుధవారం తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 15 వరకు గడువు పొడిగించినట్టు వివరించారు. అర్హులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన పిల్లలకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

నేడు 'బావుడా' కార్యాలయం ప్రారంభం

బాపట్ల: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బావుడా) కార్యాలయం గురువారం ప్రారంభిస్తున్నట్లు బావుడా వైస్ చైర్మన్ ఎ.భాను ప్రతాప్ బుధవారం తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో సాయంత్రం 4.30గంటలకు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బావుడా చైర్మన్‌గా దేవినేని మల్లికార్జునరావు ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు.

కరువు తీరా ఎరువులు

ఖరీఫ్ సాగుకు 62వేల మెట్రిక్ టన్నులు

- యూరియా, డీఏపీ, సూపర్, పొటాష్ దిగుమతి
- ఈ నెలలో 4వేల మెట్రిక్ టన్నుల రాక
- మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా
- ఖరీఫ్‌లో 3.70లక్షల ఎకరాల్లో పంటలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రైతు పక్షపాతిగా పేరుగడించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు అన్నివిధాలా వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి వాటి పరిధిలో వ్యవసాయ రంగానికి ఊతంగా నిలిచింది. రైతులకు అవసరమైన సలహాలు, సహాయ సహకారాలను గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. పంటల సాగు మొదలు పండిన పంటలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం గమనార్హం. అవసరమైన సమయంలో అవసరమైన మేరకు వ్యవసాయ రంగానికి సహకారం అందించి వెన్నుదన్నుగా నిలడం విశేషం. ఖరీఫ్ సీజన్‌కు నెల ముందు నుంచే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. సీజన్ వచ్చాక రసాయన ఎరువుల కోసం ఎదురుచూసి రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఇప్పటికే ఎరువులు సిద్ధం అయ్యాయి.

ఖరీఫ్ సాగు ఇలా...

జిల్లాలో వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం వచ్చే ఖరీఫ్ సీజన్‌లో 3.70లక్షల ఎకరాల్లో పంటల సాగు ఉంటుంది అంచనా. ప్రధానంగా 2.20లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతుండగా, మిగిలిన విస్తీర్ణంలో మిరప, పత్తి, అపరాల పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు.

62 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు..

ఖరీఫ్ సాగుకు 62 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరమని అధికారులు అంచనా వేశారు. యూరియా, డీఏపీ, సూపర్ ఫాస్ఫేట్, పొటాష్, 20–20 తదితర ఎరువులు అవసరమవుతాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యాక ఎరువులు దిగుబడి చేసుకుని జిల్లా వ్యాప్తంగా రైతులకు సరఫరా చేయడం కష్టమే.. ఎరువుల సరఫరా ఏమాత్రం ఆలస్యమైనా రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వచ్చే ఖరీఫ్‌కు ముందస్తుగానే ఎరువుల సరఫరాకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా వారీగా అవసరమైన ఎరువుల ఇండెంట్ పంపాలని జిల్లా వ్యవసాయ అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇప్పటికే జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆమోదం తెలిపిన ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే ఎరువులను ఎప్పటికప్పుడు జిల్లాలకు తరలించాలని నిర్ణయించింది. జిల్లాలో ఎరువుల నిల్వలకు గొడౌన్‌లు సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించింది. మే నెల నుంచే ఎరువులు జిల్లాకు పంపనున్నట్లు చెప్పారు.



సమావేశంలో నిర్ణయం...

జిల్లా వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు కలిసి బుధవారం బాపట్లలో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రాథమిక పరపతి సంఘాలు, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలు, ఆర్‌బీకే ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే ఎరువులను నిల్వ చేసుకునేందుకు గోదాములు సిద్ధం చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు.

> **రైతులకు అందుబాటులో ఎరువులు**
>
> వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం ఇప్పటి నుంచే ప్రభుత్వం జిల్లాకు ఎరువులను తరలిస్తోంది. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, పొటాష్, సూపర్ తదితర ఎరువులను జిల్లాకు రానున్నాయి. ఈనెలలోనే 4వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయి. ఎరువుల నిల్వలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న గోదాములలో సిద్ధంగా ఉన్నాయి.
>
> – అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి

సిద్ధంగా ఎరువుల గోదాములు...

జిల్లా వ్యాప్తంగా 112 పీఏసీఎస్‌లు, 8 డీసీఎంఎస్‌లతో పాటు గ్రామ పంచాయతీల స్థాయిలో ఆర్‌బీకేలు సిద్ధంగా ఉన్నాయి. 21వేల మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉంచుకునే సామర్థ్యం ఉన్న గోదాములున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. మేనెల లోనే సుమారు 4వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు రానున్నాయి. రైలు వ్యాగన్ల ద్వారా తొలుత ఎరువులు చీరాల, బాపట్ల, ఒంగోలు, తెనాలి, గుంటూరు ప్రాంతాలకు వస్తాయి. అక్కడి నుంచి మార్క్‌ఫెడ్ వీటిని లారీల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న గోదాములకు తరలిస్తారు. రైల్వే గోదాముల నుంచి మార్క్‌ఫెడ్ స్వయంగా ఎరువులను జిల్లాకు తరలిస్తుంది. మే నెల నుంచి అక్టోబర్ వరకు ప్రతి నెలా జిల్లాకు ఎప్పటికప్పుడు ఎరువులు తరలిస్తారు. దీంతో ఖరీఫ్ రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచుతుంది.

వ్యాపారంలో పెట్టిన నగదు ఇవ్వలేదని హత్య

- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: వ్యాపారంలో పెట్టిన నగదు తిరిగి ఇవ్వలేదనే అక్కసుతో స్నేహితుడిని ఆటోతో ఢీకొట్టి హత్య చేయడమేకాక రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన హంతకుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

గతనెల 9న బల్లికురవ మండలం కూకట్లపల్లికి చెందిన ఒరుగంటి స్వామి అద్దంకి–మేదరమెట్ల దారిలో నల్లవాగు బ్రిడ్జి దాటిన తర్వాత ఖాళీ స్థలంలో తలకు బలమైన గాయమై, కుడి కాలు విరిగి మరణించాడని అతడి సోదరుడు ఒరుగంటి శ్రీనివాసరావు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అద్దంకి పట్టణ ఇన్‌స్పెక్టర్ రోశయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనుమానంతో స్వామి జేబులోని మొబైల్ ఫోన్‌ను చేసి పరిశీలించారు. అందులో ఎక్కువసార్లు మాట్లాడిన కొన్ని నంబర్లు గుర్తించారు. అందరికంటే ఎక్కువసార్లు మాట్లాడిన ఓ నంబర్‌ను గుర్తించి స్వామి కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. ఆ నంబర్ వినుకొండ మండలం ఏనుగుపాలెంకు చెందిన దావూలూరి రాంబాబుదని, ఇద్దరూ మంచి స్నేహితులని, వినుకొండ సమీపంలోని గోకనకొండలో ఒక రైస్‌మిల్లును అద్దెకు తీసుకుని వ్యాపారం చేశారని చెప్పారు. దీంతో వ్యాపార లావాదేవీలతో హత్య జరిగి ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు ఆ దిశగా విచారణ ప్రారంభించారు. మిల్లులో ధాన్యం కొనుగోలుకు రాంబాబు రూ.లక్ష స్వామికి ఇచ్చినట్టు తెలుసుకున్నారు. మిల్లు ప్రారంభంకాగానే రాంబాబు అనారోగ్యంతో ఇంటికి వెళ్ళిపోయాడని, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వచ్చి రూ.లక్ష అడిగాడని గుర్తించారు. ఎంతకూ డబ్బులు ఇవ్వకపోవడంతో స్వామిని రాంబాబు పథకం ప్రకారం హత్య చేశాడని తేల్చారు.

బిర్యానీ తిందాం రమ్మని పిలిచి..

పోలీసుల దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం ... రాంబాబు ఏప్రిల్ 9న స్వామికి ఫోన్ చేసి బిర్యానీ తినేందుకు అద్దంకి రావాలని పిలిచాడు. ఇద్దరూ మేదరమెట్ల వెళ్లే దారిలో బిర్యానీ తిన్నారు. ఈ సమయంలో డబ్బుల విషయమై గొడవ పడ్డారు. అనంతరం స్వామి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రాంబాబు ఆటోతో ఢీకొట్టి తలపై తొక్కించాడు. ఆ తర్వాత వైజాగ్ పరారయ్యాడు. బుధవారం వైజాగ్ నుంచి రాంబాబు తిరిగి అద్దంకి వచ్చాడన్న సమాచారం మేరకు పోలీసులు వలపన్ని అతడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు ఎస్పీ అభినందన

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినప్పటికీ చాకచక్యంగా దర్యాప్తు చేసి కేసు ఛేదించిన అద్దంకి పోలీసులను ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు. ఎస్సై సమందర్వలి, హెడ్ కానిస్టేబుల్ అంజమ్మరావు, కానిస్టేబుల్ వైవి సాగర్ బాబులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసేందుకు వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ, ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని – సాక్షి నెట్‌వర్క్

లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం



కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివకుమార్

అద్దంకి: లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన సంతమాగులూరు మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని ఏల్చూరులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన తుమ్మూరి కోటేశ్వరరావు (70) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా హర్యానాకు చెందిన కంటైనర్ లారీ ఢీకొంది. వెనుక చక్రాలు కోటేశ్వరరావు మీదగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు అనే వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎస్సై శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



గృహ నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం బాపట్ల మండలంలోని మూలపాలెం జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ మూలపాలెం జగనన్న కాలనీలో మొత్తం 990 గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మూలపాలెం జగనన్న కాలనీలో 140 గృహాలు పునాదుల స్థాయిలోనే ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మూలపాలెం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పంటకాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రంలో మజ్జిగను అందజేశారు. ఆయనవెంట డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్, బాపట్ల ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సంరక్షణకు కృషి

బాపట్ల: దివ్యాంగుల హక్కుల సంరక్షణకు అధికారులంతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. దివ్యాంగుల సంరక్షణపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటైంది. కమిటీ చైర్మన్, కలెక్టర్ చాంబర్లో బుధవారం జిల్లాస్థాయి కమిటీ తొలి సమావేశం జరిగింది. దివ్యాంగుల సంక్షేమం, హక్కుల సంరక్షణ కోసం 2016లో ఏర్పాటైన చట్టం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 22 మందితో జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటైందని కలెక్టర్ ప్రకటించారు. మానసిక దివ్యాంగుల సంరక్షణపై పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు వృత్తి నైపుణ్యాల వృద్ధికోసం అనుబంధ శాఖల అధికారులు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతివైద్యశాలలోనూ దివ్యాంగులకు ప్రత్యేకంగా బెడ్లు కేటాయించి వైద్య సేవలు అందించాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చట్టం, నియమనిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు, డీపీఓ రమేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి వెంకటేశ్వర్లు, మిగిలిన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



వీరన్నపాలెంలో మృతి చెందిన స్వరూప

పర్చూరు (కారంచేడు): మండలంలోని వీరన్నపాలేనికి చెందిన దార స్వరూప (28) బుధవారం ఉదయం ఇంటి వద్ద ఉతికిన బట్టలు ఆరేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే పర్చూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో కుటుంబంతోపాటు, గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్వరూప భర్త కిరణ్ అదే గ్రామంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద పిల్లలు విలపిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.

ఉరివేసుకుని షిఫ్ట్ ఆపరేటర్ మృతి

అద్దంకి: స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ మృతిచెందిన ఘటన మండలంలోని కల్లం స్పిన్నింగ్ మిల్లు సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, భద్రక్ జిల్లా గిరమటి గ్రామానికి చెందిన సుధా మినిమాలిక్ (23)కు నెల రోజుల క్రితం పెళ్లయింది. తండ్రి ప్రోద్బలంతో బతుకు తెరువు కోసం మండలంలోని కుంకుపాడు సమీపంలోని కల్లం స్పిన్నింగ్ మిల్లులో గత నెల నుంచి షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం తండ్రికి తనకు ఇక్కడ పనిచేయడం ఇష్టం లేదని ఫోన్ చేసి చెప్పాడు.నాలుగు రోజులు నుంచి మిల్లు పనికి వెళ్లడం లేదు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పడుకున్నాడు. భార్య తెల్లవారి లేచి చూసే సరికి మంచంపై లేడు. ఇంతలో తెలిసిన వ్యక్తి వచ్చి మీ భర్త రోడ్డు పక్కన వేప చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడని చెప్పాడు. దీంతో అక్కడికి వెళ్లిన భార్య పోలీసులకు సమాచారం అందించింది. ఎస్సై సమందర్ వలి అక్కడకు వెళ్లి విచారించి, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం భార్యకు అప్పగించారు.

రైతు వేషంలో వచ్చి బురిడీ

- సరికొత్త తరహా సైబర్ మోసం
- బ్యాంక్ సేవా కేంద్రాలే టార్గెట్
- కారంచేడు, పెదనందిపాడు గ్రామాల్లో ఘటనలు

కారంచేడు: రైతు వేషంలో వచ్చిన ఓ వ్యక్తి బ్యాంక్ వినియోగదారుల సేవా కేంద్రం యజమానిని బురిడీ కొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుని కథనం ప్రకారం.. కారంచేడు స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో కొల్లా పవన్‌కుమార్ కొన్నేళ్లుగా మీసేవ, బ్యాంక్ వినియోగదారుల సేవా కేంద్రం నిర్వహిస్తున్నాడు. గతనెల 27న రైతు వేషంలో వచ్చిన ఓ వ్యక్తి తనది పర్చూరు మండలం నూతలపాడని పరిచయం చేసుకున్నాడు. కూలీలకు ఇవ్వడానికి డబ్బులు అవసరమని, ఫోన్‌పే నంబర్‌కు మనీ పంపిస్తానని, ఆ సొమ్మును ఇవ్వాలని కోరాడు. దీనికి పవన్‌కుమార్ అంగీకరించడంతో 10 నిమిషాల్లో ఆ వ్యక్తి సార్ మీ అకౌంట్‌కు డబ్బు వచ్చింది చూడండి అని చెప్పాడు. మొదటగా (9849942345, కె.శ్రీనివాసరెడ్డి) నంబర్ నుంచి రూ. 30 వేలు, రెండోసారి మళ్లీ రూ.25 వేలు చెల్లించాడు. తరువాత ఇంకొక నంబర్ (9849942345, చాగంటి రాజేష్) నుంచి రూ.30 వేలు కలిపి మొత్తం రూ.85 వేలు ఆ వ్యక్తి తీసుకెళ్లాడు. అమౌంట్ ఫోన్‌పే ద్వారా పంపిన ఇద్దరిదీ తెలంగాణనే. కాగా ఆ రోజు సాయంత్రం ఒక వ్యక్తి ఫోన్ చేసి నేను ఉదయం మీ నంబర్‌కు ఫోన్‌పే ద్వారా అమౌంట్ పంపాను. తిరిగి నాకు పంపాలని కోరాడు. దీంతో అవాక్కయిన పవన్‌కుమార్ జరిగిన విషయం చెప్పాడు. దీంతో అవతలి వ్యక్తి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పవన్ కుమార్‌కు చెందిన అన్నిరకాల బ్యాంక్ ఖాతాలను పోలీసులు బ్లాక్ చేశారు. దీంతో పవన్‌కుమార్ లబోదిబోమంటున్నారు. ఈ వ్యవహారంపై సైబర్‌క్రైం పోలీసులు త్వరగా విచారణ జరపాలని కోరుతున్నాడు. ఇదే తరహా నేరం గుంటూరు జిల్లా పెదనందిపాడులోని మీసేవా కేంద్రంలోనూ గత నెల 25న జరిగినట్లు తెలిసిందని, రెండు నేరాలకు పాల్పడిన వ్యక్తి ఒకరై ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కోనతో దేవానంద్ భేటీ

బాపట్ల అర్బన్: బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతిని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి ఝాన్సీలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాపట్ల శాఖ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

బాపట్ల అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించటంలో వివిధ శాఖల అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని బాపట్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిన్న పోతుల హరిబాబు అన్నారు. బుధవారం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బండ్లమ్మ అమ్మవారి వార్షిక తిరునాళ్ల ప్రారంభం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి బండమ్మ దేవాలయ వార్షిక తిరునాళ్ల బుధవారం ప్రారంభించారు. అమ్మవారికి అభ్యంగ స్నానం, అఖండ జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. వంశ పారంపర్య అర్చకులు అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

షిరిడి మందిరానికి శంకుస్థాపన

రేపల్లె రూరల్: పట్టణంలోని ఇసుకపల్లిలోని షిరిడి సాయిబాబా మందిర శంకుస్థాపన బుధవారం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే శంకరరావు, రిటైర్డ్ ఎస్పీ కే బాలకోటేశ్వరరావు- రమాదేవి దంపతులు పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి మేరుగ నాగార్జున
- గోవాడలో గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గోవాద(వేమూరు): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమృతలూరు మండలం గోవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు ఉంటే దృష్టికి తీసుకురావాలని కోరారు. వేమూరు నియోజకవర్గంలో పేద కుటుంబాలు సంక్షేమ పథకాలు అందలేదని నా దృష్టికి తీసుకొస్తే గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయం సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలు చేపట్టి ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు నేరుగా పేద కుటుంబాల ఖాతాల్లో వేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల్లో అవినీతి లేకుండా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందని పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇతర దేశాలకు దిక్సూచిగా ఉన్నాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రావర్ల నరేంద్ర, సొసైటీ అధ్యక్షులు యలవర్తి సురేష్, మోదుకూరి హరిబాబు, సిహెచ్.చౌదరి, దేవరకొండ శ్రీనివాసరరావు, శ్రీరామ్మూర్తి, బలిజేపల్లి శివనాగమల్లేశ్వరరావు, బందిలి చెత్తయ్య, చందోలు సుందరరావు, నలుకుర్తి సుధాకర్, దేవరకొండ సత్యవతి, మునిపల్లి జక్రయ్య, నూతలపాటి సురేష్, పావులూరు సుబ్బారావు, తాడికొండ సీతారామయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి



కొల్లూరు: ఉపాధిహామీ కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు మండలంలోని కిష్కిందపాలేనికి చెందిన గుంటూరు శామ్యూల్ (62) తమ గ్రామం సమీపంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మట్టి పనికి వెళ్లాడు. తోటి కూలీలతో కలసి పనిచేస్తున్న సమయంలో శరీరం మొత్తం చెమటలు పట్టడంతోపాటు, వాంతులు మొదలయ్యాయి. వెల్లటూరులోని వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి కోదండరామస్వామి దేవస్థానంలో సీతారామలక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. హైదరాబాదుకు చెందిన వేల్పూరి విజయలక్ష్మి కుమారులు విగ్రహ దాతలు వెంకటేష్ కుమార్-దీపాలి, వేల్పూరి రామకృష్ణ-భారతి దంపతులు, కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోతార్లంకకు చెందిన వినుకొండ మురళీకృష్ణ వెంకట నరసింహమూర్తి పర్యవేక్షణలో గంజాం నారాయణ రఘురామ్, శ్రీ భాష్యం సాయివరుణ్, శ్రీ భాష్యం నృసింహ సాకేత్, రత్నాకర చక్రవర్తిలు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. దేవాలయానికి భట్టిప్రోలుకు చెందిన పులికొండ వెంకటసాయి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్థలాన్ని అందించారు. వాస్తు శిల్పి, వాస్తు సామ్రాట్ వేదవ్యాస అవార్డు గ్రహీత వంగర చలమయ్య సిద్ధాంతిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.


విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న విగ్రహ దాతలు

పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయండి

డీఈఓ రామారావు

చెరుకుపల్లి: పాఠశాలల భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి ఎస్సీ కాలనీలో నాడు- నేడు ఫేజ్-2 కింద రూ.42 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాలను డీఈఓ బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పనులు పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కోరారు. నిర్మాణ పనుల్లో తప్పని సరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. డీఈఓ వెంట మండల విద్యాశాఖ అధికారి టి.నవీన్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ నాంచారమ్మ, తురిమెళ్ళ దివాకర్ పాల్గొన్నారు.


గుళ్లపల్లిలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలిస్తున్న డీఈఓ, ఎంఈఓ

రెవెన్యూ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

జేసీ సీహెచ్ శ్రీధర్

బాపట్ల: రెవెన్యూ అర్జీలను గడువులోగా పరిష్కరించకపోతే రెవెన్యూ అధికారులు నేరం చేసినట్లేనని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. రెవెన్యూ అంశాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అంశాలపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. వాటిని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. 217 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. అకాల వర్షాలకు ధాన్యం దెబ్బతినకుండా టార్పాలిన్ పట్టలు రైతులకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, సీపీఓ జి.భరత్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్

విశాఖ ఉక్కు కోసం ఉద్యమిద్దాం..

బాపట్ల: విశాఖ ఉక్కు ను కాపాడుకోవడానికి కార్మికులు ప్రజాస్వామికవాదులు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సిపిఎం పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. బుధవారం బాపట్ల లో విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని కోరుతూ సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, పట్టణంలోని తవ్వకాల్వ వద్ద రాస్తారోకో నిర్వహించారు.నాయకులు తన్నీరు సింగరకొండ, జె. బి.శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు పఠాన్ రాజేష్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాస్తారోకో

రేపల్లె: విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణని వ్యతిరేకిస్తూ విశాఖ స్టీల్ పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్, ఏఐటీయూసీ నాయకులు పి.నాగాంజనేయులు మట్లాడారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై నిరసన

కొల్లూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొనిగల సుబ్బారావు, జి.సుధాకర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మనోజ్ పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

ఇంటూరు(వేమూరు): జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రారంభించినట్లు జనగణన జిల్లా కో ఆర్డినేటర్ గోవిందయ్య బుధవారం తెలిపారు. అమృతలూరు మండలం ఇంటూరులో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, రుహెసీ, ప్రవీణ్ చంద్ర పాల్గొన్నారు.

క్రాఫ్ట్ బజారుకు అనుమతి సరికాదు

బాపట్ల: బాపట్ల పట్టణంలోని ఏబీఎం పాఠశాలలో క్రాఫ్ట్‌బజారుకు డీఈఓ ఆంజనేయులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని పాఠశాల కరస్పాండెంట్ అండ్ కస్టోడియన్ ఇనగలూరి మాల్యాద్రి పేర్కొన్నారు. విద్యాసంస్థలల్లో షెడ్లు వేసి వ్యాపారం చేయటం సరికాదన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

రేపల్లె: ప్రతిభ ఉన్న క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని నగరం ఎస్వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ జి.హనుమంతరావు చెప్పారు. పట్టణంలోని ఎంసీఏ హాలులో బ్యాడ్మింటన్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా సాత్విక్‌రాజ్ రాంకీరెడ్డి, చిరాగ్‌శెట్టిలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి జీ.బాపారావు, సభ్యులు లక్ష్మీనారాయణ, నంబూరు సత్యప్రసాద్, పరుచూరి శ్రీనివాసరావు, కోచ్ రవి పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె రూరల్: రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని మొక్కజొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ అక్తర్ హుసేన్ కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు.

చుండూరు(భట్టిప్రోలు): అకాల వర్షాల ప్రభావంతో మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం దెబ్బకు రైతులు పట్టాలు కప్పుతున్నారు. ఈదురుగాలులు వేయడంతో పట్టాలపై బరువులు వేసి ఉంచుతున్నారు. పంటపొలాల్లో విరిచిన కండెలు అలానే పడి ఉన్నాయి. మరి కొంత పంట నిలువు మీదే పంట చేలో అలానే ఉంది. కండెలు బరువై వాలిపోయి పడిపోతున్నాయి. ఈ అకాల వర్షాలు రైతులకు అపార నష్టం కలిగించాయి. పంట దిగుబడులను ఆరబెట్టుకోవడం, భద్రపరచుకోవడంతోనే రైతులకు సమయం సరిపోతుంది.

నేడు మోడల్ పరీక్ష

భట్టిప్రోలు: ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గురువారం గాయత్రి అకాడమీలో మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి.మనోజ్ కుమార్ బుధవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 94909 87646 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆదాయం పెంపుదలకు చర్యలు: డీపీఓ

పిట్టలవానిపాలెం: గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి రమేష్ బాబు ఆదేశించారు. మండల కేంద్రంలోని పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన డంపింగ్ షెడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడిచెత్త నుంచి సేకరించిన వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేయాలని తెలిపారు. తద్వారా ఆదాయం పెంచుకుని పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అదే విధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామంలో ఎక్కడా కన్పించకుండా చూడాలని ఆదేశించారు. క్లాప్‌మిత్రలు, షెడ్డు మిత్రలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండాలని తెలిపారు. వారం రోజుల్లో వర్మిని విడుదల చేయాలని గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావుకు సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కె.పద్మజ ఉన్నారు.

లోకాస్ యాప్‌తో మేలు

చెరుకుపల్లి: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్ఆర్ఓ లోకాస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో వీఓఏ, సీసీలకు శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని వారికి చేరవేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత వీఓఏలపై ఉందన్నారు. ఈ యాప్ ద్వారా వీఓఏలు స్వయం సహాయక సంఘ సభ్యుల ప్రాథమిక సమాచారం పూర్తిగా డేటా ఎంట్రీ చేయటం, యాప్‌ల ద్వారా సంఘాలను మాపింగ్, ప్రతి సభ్యురాలి సంఘం, గ్రామ సంఘం, మండల సమాఖ్య, ప్రాథమిక యూనివర్సల్ యాప్‌లో బద్రపరచటమే యాప్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రేపల్లె క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి, ఏపీఎం డి.వెంకటేశ్వర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ద్రాక్షావలి, సీసీలు నాగకుమారి, నాగరాజా, బాటసారి, కోటేశ్వరరావు, అకౌంటెంట్ ఇందిర పాల్గొన్నారు.